# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 జనవరి 31, 2015

హైదరాబాద్ నగరంలోని ప్రజలు కనీస అవసరాలు కూడా పూర్తి స్థాయిలో తీర్చుకోలేకుండా దుర్భరమైన పరిస్థితి ఎదుర్కోవడం అత్యంత దారుణమైన విషయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నగరాన్ని ఇలాగే వదిలేస్తే భవిష్యత్ మరింత ఘోరంగా తయారవుతుందని, ఇప్పుడు హైదరాబాద్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌కు పట్టిన జబ్బు వదలాలంటే మాములు వైద్యం సరిపోదని శస్త్ర చికిత్స చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. నగరంలోని మోండా మార్కెట్‌ను సందర్శించి వచ్చిన ముఖ్యమంత్రి నగరంలో ప్రజల అవసరాలకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరిపారు.

ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహరెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావ్, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్ కుమార్, హెచ్ఎండిఏ ఛైర్ పర్సన్ ప్రదీప్ చంద్ర, టిఎస్ ఐఐసి ఎండి జయేష్ రంజన్, అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ బిఎల్.మిశ్రా తదితరులు ఇందులో పాల్గొన్నారు.

నగరానికి అందాన్నిచ్చే హుస్సేన్‌సాగర్ మురికి నీటి కూపమైందని, అటవీ భూములు ఉన్నా చెట్లు లేవని, మురికి కాలువల పరిస్థితి దారుణంగా ఉందని, రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, నిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదని, దోభి ఘాట్లు కూడా చాలినన్నీ లేవని, కూరగాయల మార్కెట్లు కూడా సరిగా లేవని, వర్షపు నీరు పంపేందుకు కూడా కాలువలు లేవని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటి రూపురేఖలు మారాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగు కావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి అన్నారు.

హుస్సేన్‌సాగర్‌ను ఈ వేసవిలో పూర్తి స్థాయిలో శుద్ధి చేయాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మురికి కాలువల నాలాలు హుస్సేన్‌సాగర్‌లోకి రాకుండా మళ్లించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే నిధులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. పనులు వేగంగా చేయాలని ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్య (ఎఫ్‌టిఎల్) నిర్ణయించాలని సూచించారు. నగర పరిధిలో ఉన్న అన్ని అటవీ శాఖ భూములను గుర్తించి వాటిలో చెట్లు విరివిగా పెంచాలని సూచించారు. వనస్థలిపురం జింకల పార్కును బాగా అభివృద్ధి చేయాలని, స్థానికులతో కమిటీ వేసి పార్కును రక్షించాలని సూచించారు. నగరంలో ఎన్ని రైతు బజార్లు అవసరమవుతాయో అంచనా వేసి వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. అంబేద్కర్ నగర్, వెంగళ్రావు నగర్‌లలో ప్రజలు అత్యంత దుర్భర పరిస్థితుల్లో, ఇరుకు గదుల్లో, మురికి కూపాల్లో జీవనం సాగిస్తున్నారని వారికోసం వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. అవసరాన్ని బట్టి రెండు మూడు టవర్లు నిర్మించి 500 కుటుంబాలు నివసించేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. నగర ప్రజలకు అవసరమయ్యేన్ని దోభి ఘాట్లు, స్మశాన వాటికలు, బరేల్ గ్రౌండ్స్, కూరగాయల మార్కెట్లు, మాంస హార మార్కెట్లు, టాయిలెట్లు, ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ ప్లేస్‌లు నిర్మించాలని సూచించారు. నగరంలో ఎవి ప్రభుత్వ శాఖల పరిధిలో ఎంత భూమి ఉందో గుర్తించాలని, ఖాళీగా ఉన్న స్థలాల్లో ఈ అవసరాలను తీర్చే నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. వారసత్వ కట్టడాల విషయంలో ఆచరణాత్మక పద్ధతి అవలంభించాలని చెప్పారు. భవిష్యత్తులో ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే ప్రత్యామ్నాయం అయ్యే అవకాశం ఉంది కాబట్టి నగరంలో ఎక్కడెక్కడ బస్‌స్టాపులు నిర్మించాలో గుర్తించి స్థలాలను ఎంపిక చేయాలని కోరారు.

-----------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం